ఆంధ్రజ్యోతి

3 వరంగల్

సోమవారం 19 ఆగస్టు 2024





తోబుట్టు వేడుక రక్షా బంధన్

- రాఖీ పౌర్ణమికి సిద్ధమైన జనం
- రాఖీలు, మిఠాయిల కొనుగోలుతో సందడే సందడి

వరంగల్ కల్చరల్/హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18: రక్తసంబం ధానికి ప్రతీకగా, సోదరీ, సోదరుల అప్యాయతను పెంపొందించే రక్షాబంధన్ పండుగను వరంగల్, హనుమకొండ జిల్లాలో సోమవారం జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. శ్రావణ మాసం పౌర్ణమి పర్వదినం రోజున జరిగే ఈ పండుగ కోసం ఆదివారం రాఖీల కొనుగోలుతో పట్టణాలు, నగర ప్రధాన ప్రాంతాలు రద్దీగా మారాయి. రాఖీలతో పాటు మిఠాయిల అమ్మకాలు జోరుగా సాగాయి.

అధిక ధరల్లో..

ఒక్క రూపాయి నుంచి రూ.500 ధర గల రాఖీల విక్రయాలు దుకాణాలలో విక్ర యిస్తున్నారు. వీటికితోడు వెండి రాఖీలు, రుద్రాక్ష రాఖీలు, ఇతర కొత్తద నంతో కూడిన డిజైన్లతో కూడిన రాఖీలను విక్రయిస్తున్నారు. గతంలో తక్కు వ ధరలో ఉండే రాఖీలు ఇప్పుడు అధిక ధరలతో అమ్ముతున్నారు. మిఠాయి లు కూడా రూ.500 నుంచి రూ. 1500 లకు కిలో చొప్పున మిఠాయిలు విక్రయిస్తున్నారు. ఇవే కాకుండా రిలయన్స్ డీమార్టుల్లో స్వీట్ బాక్స్‌లు ఒకటి కొంటే ఒకటి ఉచితం వంటి అమ్మకాలు కూడా కొనసాగుతున్నాయి. రాఖీలు కట్టుకొనే సమయంపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవాలు లేవని ప్రముఖ పురోహితులు స్పష్టం చేశారు. పౌర్ణమి వేళ ఏ సమయంలోనైనా రాఖీలను కట్టుకోవచ్చని, ఎక్కడా రాఖీలకు ముహూర్తాలు ఉండవని పంచాంగకర్తలు, సిద్ధాంతులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఎప్పుడైనా రాఖీని కట్టుకోవచ్చు. శ్రావణ పౌర్ణమి రోజును రక్షా బంధన్‌గా, జంజిరాల పున్నమిగా జరుపుకుంటారు. బ్రాహ్మణులు, పద్మశాలీలు, విశ్వబ్రాహ్మణులు తమ గాయిత్రీధారణను జంజిరాలను తొలగించి పౌర్ణమి రోజున కొత్త జంజిరాలను ధరిస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పద్మశాలీ సంఘాల ఆధ్వర్యంలో గాయత్రీధారణ మహోత్సవాలను ఏర్పాటు చేశారు.



'చెత్త' శుద్ధి ఏదీ?!

నగరంలోని చెత్త తరలింపులో ఆటంకాలు

- ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ల ఏర్పాటుపై విమర్శలు
- విలువైన స్థలాలు వృథా అవుతున్నాయంటున్న జనం
- నేరుగా డంపింగ్ యార్డుకు తరలించాలని డిమాండ్
- మంత్రి పొంగులేటి ఆదేశాలు బుట్టదాఖలు
- డంపింగ్ యార్డులపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత
- బల్దియా అధికారుల తీరుపై ప్రజల అసంతృప్తి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18: గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌కు చెత్తను సేకరించడం, తరలించడం పెద్ద తలనొప్పిగా మారింది. హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా చెప్పుకునే వరంగల్ మహానగరంలో సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేయాలలో ఇప్పటికీ ఒక స్పష్టత లేదు. అధికారికంగా ఒక్క రాంపూర్ శివారులోని 32 ఎకరాల విస్తీర్ణంలో ప్రతీ రోజు వందల టన్నుల చెత్తను ఒక్క చోట చేర్చడం చాలా ఇబ్బంది మారింది. అక్కడి బయోమైనింగ్ ప్లాంట్ అనుకున్నట్టుగా విజయవంతం కాకపోవడంతో రూ.కోట్ల నిధులు చెత్తపాలు అన్నట్టుగా ఉంది. అలాగే బాలసముద్రం, పోతననగర్ చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను స్థానికులు వ్యతిరేకిస్తుండడంతో అధికారులకు ఇబ్బందిగా మారింది.

నిత్యం..

గ్రేటర్ వరంగల్ పరిధిలో 32 విలీన గ్రామాలను కలుపుకుని 66 డివిజన్‌లు ఉన్నాయి. నిత్యం 2.86లక్షల ఇళ్ల నుంచి ప్రతీ రోజు చెత్త కుప్పలు తెప్పలుగా వెలువడుతూనే ఉంటుంది. వరంగల్ బల్దియా పరిధిలో ప్రతీ రోజు 450 టన్నుల చెత్తను శానిటేషన్ సిబ్బంది సేకరిస్తున్నారు. 270 టన్నుల తడిచెత్త, 150 టన్నుల పొడి చెత్త, 15 టన్నుల శానిటరీ వేస్ట్ (హానికమైన చెత్త), 15 టన్నుల హజార్డర్ చెత్తను ఇళ్ల నుంచి సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు.

మూడు చోట్ల..

నగరంలోని చెత్తను బల్దియా పరిధిలో రాంపూర్ శివారులో 32 ఎకరాల డంపిండ్ యార్డ్, హనుమకొండ బాలసముద్రంలో వెహికిల్ షెడ్డు పక్కన 10 ఎకరాల రెండో చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్, వరంగల్ పోతననగర్‌లో ఐదు ఎకరాల మూడో ట్రాన్స్‌ఫర్ స్టేషన్, ఉర్సుగుట్ట వద్ద 6 ఎకరాల ప్రభుత్వ స్థలంలో సేకరించి డంప్ చేస్తున్నారు. కానీ ఇటీవల ఆయా ప్రాంతాల చుట్టు పక్కల నివసించే ప్రజలు చెత్త దుర్వాసన భరించ లేక కర్రలతో స్వచ్ఛ ఆటోలు, ట్రాక్టర్లను రానివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో చాటుమాటుగా స్వచ్ఛ ఆటోలు ఉర్సుగుట్ట, పోతన నగర్ వద్ద చెత్త డంపింగ్ చేయాల్సిన పరిస్థితి ఉంది. తర్వాత కొద్ది రోజులకు పోతననగర్, ఉర్సుగుట్ట వద్ద చెత్త డంపింగ్‌ను పూర్తిగా నిలిపి వేశారు. బాలసముద్రం ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచి స్వచ్ఛ ఆటోలు, స్వచ్ఛ ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను టిప్పర్‌లు, డంపర్ బిన్‌ల సహాయంతో అతికష్టం మీద కార్మికులు ప్రతీ రోజు రాంపూర్‌కు తరలిస్తున్నారు.



వృథా..

నగరంలో సేకరించిన చెత్తను నేరుగా డంపిండ్ యార్డులకు తరలించకుండా ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లకు తరలించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రూ.కోట్లు ఖర్చు చేసి నగరంలో రెండుచోట్ల ఉన్న ఈ చెత్త స్టేషన్‌లు ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో ఎక్కువ మంది సిబ్బందిని, వాహనాలను ఏర్పాటు చేసి నేరుగా మడికొండ డంపింగ్ యార్డుకు తరలిస్తే అదనపు భారంతో పాటు నగరంలో చెత్త సమస్యకు పరిష్కారం లభిస్తుందని నిపుణులు చెప్పుకొస్తున్నారు. అంతే కాకుండా నగరంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు చెత్త కోసం కేటాయించడం సరైంది కాదని అంటున్నారు. వాటిలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తే ప్రజలకు మంచి చేసినట్లు అవుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాంపూర్ యార్డుతో ఇబ్బందులు

రాంపూర్ శివారులో పెద్దఎత్తున డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం

మిగతా 6వ పేజీలో..

పర్యావరణానికి ముప్పు

- ఠాకూర్ రతన్‌సింగ్, పర్యావరణవేత్త, హనుమకొండ



నగరంలోని ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను చెత్తవాహనాలపై కవర్లు కప్పి నేరుగా డంపింగ్ యార్డుకు తరలించాలి. ఇప్పటికే వరంగల్ నగరంలో పర్యావరణ ముప్పు వల్ల ప్రజలకు చాలా రకాలైన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ప్రధానంగా నగరంలో అభివృద్ధి పనులకు ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. ప్రభుత్వం ఇంటికో మొక్క అనే నినాధంతో ముందుకు వెళితే సమస్య కొంత వరకు తగ్గుతుంది.

చెత్త వాహనాలకు మరమ్మతులు

చెత్తను తరలించే వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో తరలింపులో ఆటంకాలు ఎదురవుతున్నాయి. బల్దియా వాహనాలకు చిన్న పాటి రిపేరు వచ్చినా నెలల తరబడి వాహనాలు బల్దియా షెడ్డులో కునారిల్లుతున్నాయి. రోడ్లపై నడవక రిపేరుకు నోచుకోక వాహనాలు శిధిలా వస్థకు చేరుకుంటున్నాయి. ప్రస్తుతం 8 టిప్పర్‌లకు 4 పని చేస్తుండగా 4 డంపర్ బిన్‌లకు 2 మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో అటు మునిసిపల్ కార్మికులు, ఇటు బల్దియా అధికారులకు చెత్త సమస్య వెంటాడుతోంది.



డంపింగ్ యార్డు తరలించాలి..

- తొట్ల రాజు, మాజీ కార్పొరేటర్, మడికొండ



మడికొండ శివారులో ఉన్న డంపింగ్ యార్డు వల్ల ప్రజలకు ఆరోగ్య సమస్యలు రావడంతో 2011లో నేను వార్డ్ మెంబర్‌గా ఉన్న సమయంలో హైకోర్టును ఆశ్రయించాను. దీంతో 2014లో బల్దియా అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. మడికొండలో చెత్త డంపింగ్ ద్వారా ప్రజలు ఇబ్బంది పడుతున్నట్టు కోర్టుకు నివేదిక ఇచ్చారు. అప్పటి మంత్రులు, ఎమ్మెల్యే డంప్‌ను ఇతర ప్రాంతాలకు తరలించి ప్రజల సమస్య పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. కానీ ఇప్పటికీ పరిష్కారం కాలేదు. రాంపూర్‌తో పాటు చుట్టుపక్కల ప్రజ లు పొగతో కళ్లు, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ త్వరలో కోర్టును ఆశ్రయిస్తాను.



వెంకటనారాయణ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

రంజిత్ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

పెళ్లింట మృత్యు హేల!

- కోనాయిమాకుల రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- పెళ్లి పత్రికలు పంచి వస్తుండగా బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఒంటిమామిడిపల్లిలో విషాదఛాయలు

ఐనవోలు/గీసుగొండ, ఆగస్టు 18: పెళ్లి బాజాలు మోగాల్సిన చోట.. చావు డప్పు మోగింది. మరో మూడు రోజుల్లో కొడుకు వివాహం జరగనుండగా అనుకోని ప్రమాదంలో తండ్రి మృత్యువాతపడడం ఆ ఇంట్లో విషాదం నింపింది. అలాగే ఇదే ఘటనలో మరో యువకుడు మరణించాడు. ఇటీవలే యువకుడికి వివాహం కాగా, అంతలోనే మృత్యువాతపడడంతో స్వగ్రామం ఒంటిమామిడిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికులు, బంధువుల వివరాల మేరకు.. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మజ్జిగ వెంకటనారాయణ(52), మజ్జిగ రంజిత్ (26)లు ఐనవోలు దేవస్థానం ఒగ్గుపూజారులుగా పనిచేస్తున్నారు. వెంకట్‌నారాయణ కుమారుడు అశోక్ వివాహం ఈ నెల 22న జరగాల్సి ఉంది. దీంతో పెళ్లి పత్రికలను బంధువులకు ఇచ్చేందుకు వరుసకు కొడుకైన రంజిత్‌ను తీసుకొని బైక్‌పై వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం తొగర్రాయికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. వీరితో పాటు పెళ్లికొడుకు అశోక్ కూడా మరో ద్విచక్రవాహనంపై వెళ్లారు. అక్కడ కార్డులు ఇచ్చిన అనంతరం రాత్రి తిరుగు ప్రయాణంలో ఇంటికి రెండు దిచక్ర వాహనాలపై వస్తున్నారు. ఈ క్రమంలో గీసుగొండ మండలం కొనాయిమాకుల సమీపంలోని ఓంకార్ ఫంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు వెంకట్ నారాయణ, రంజిత్ ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. వెనుకాలే వస్తున్న అశోక్ ఈ హఠాత్‌సంఘటనతో నిశ్చేష్టుడయ్యాడు. కళ్ల ముందు తండ్రి, సోదరుడు మృతిచెందడంతో రోదించాడు.

కాగా ఘటన స్థలాన్ని గీసుగొండ సీఐ బాబులాల్ తన సిబ్బందితో చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎంజీఎంకు తరలించారు. ఆదివారం అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మూడు రోజుల్లో..

వెంకటనారాయణ, దేవేంద్ర దంపతులకు ఒక కుమారుడు, ఒక కూతురు. కూతురికి వివాహమైంది. కుమారుడు అశోక్ సైతం ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానంలో తండ్రితో పాటు ఒగ్గు పూజారుడిగా సేవలందిస్తున్నాడు. కుమారుడి పెళ్లి కోసం సంబంధాలు చూస్తూనే ఇటీవల ఇంటిని నిర్మించాడు. పెళ్లి సంబంధం ఖాయమైంది. మరో మూడు రోజులైతే ఆ ఇంట్లో బాజా భజంత్రీలు మోగేవి. అప్పటికే పెళ్లి ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. ఇంతలోనే మృత్యువు ఆ కుటుంబంలో విషాదాన్ని నింపి కల్యాణ తంతును నిలిపివేసింది. కాగా, తన పెళ్లి పత్రికలు పంపిణీ చేస్తూ తండ్రి మృతిచెందడాన్ని అశోక్ జీర్ణించుకోలేకపోతున్నాడు. తల్లి, సోదరితో కలిసి రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. ఇక మజ్జిగ రంజిత్ ఇటీవల ఇండియన్ ఆర్మీలో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇంతలోనే దూరపుబంధువు యువతితో ఏర్పడిన ప్రేమవ్యవహారం ఆర్మీ ఉద్యోగానికి బ్రేక్ పడింది. యేడాది కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇంటి వద్ద వ్యవసాయపనులు చూసుకుంటూ ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఒగ్గు పూజారిగా సేవలందిస్తున్నాడు. 15 రోజుల కిందట మడికొండ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌లో కొలువుసాధించాడు. ఇంతలోనే మృత్యువు నూతన దంపతులను విడదీసింది.



మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో సోదాలు జరుపుతున్న ఏసీబీ అధికారులు

ఏసీబీ వలలో ఈవో

- దుకాణదారుడి నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్
- గుంజేడు శ్రీ ముసలమ్మ కార్యనిర్వాహణ అధికారిని పట్టుకున్న అధికారులు
- మరిపెడ ఇంట్లోనూ తనిఖీలు

కొత్తగూడ (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 18: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు గ్రామంలోని శ్రీముసలమ్మ ఆలయ ఈవో భోగోజు భిక్షమాచారి ఆదివారం ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ఓ దుకాణ టెండరుదారుడి నుంచి రూ.20వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

గుంజేడు శ్రీముసలమ్మ ఆలయం ఆవరణలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కిరాణ షాపు ఏర్పాటు చేశారు. గత మే 29న టెండరులో గుంజేడుకు చెందిన పాల్తి రాములు అనేవ్యక్తి ఈ దుకాణాన్ని దక్కించుకున్నాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన నల్లెపు సాంబయ్య ఈ షాపును నడిపిస్తున్నాడు. ఈ దుకాణంలో మద్యం అమ్ముతున్నారని గత జూన్ 11న షాపును దేవాదాయ శాఖ సీజ్ చేసింది. ఈ క్రమంలో దుకాణాన్ని మళ్లీ తెరుచుకోవడానికి సాంబయ్య దేవాదాయశాఖ ఉన్నతాధికారి నుంచి అనుమతి

మిగతా 6వ పేజీలో..

రైతు పక్షపాతి కాంగ్రెస్ సర్కార్

- కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో 'పరకాల' అభివృద్ధి
- గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోయే రైతులకు న్యాయం చేస్తాం..
- ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పరకాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన





అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాట్లాడుతున్న మంత్రి

పరకాల, ఆగస్టు 18: తెలంగాణ రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. పరకాల పట్టణంలో రూ.5కోట్లతో ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణ పనులు, రూ.11.74కోట్లతో అమృత్ 2.0 పథకానికి సంబంధించిన పనుల ప్రారంభోత్సవానికి మంత్రి ఆదివారం పరకాల పట్టణానికి విచ్చేశారు. మునిసిపాలిటీ ఆవరణలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రారంభించారు. అనంతరం పరకాల మునిసిపాలిటీ కార్యాలయంలో పరకాల శాసనసభ నియోజకవర్గ పరిధిలోని వివిధ అభివృద్ధి పనులకు, కొనాయమాకుల ప్రాజెక్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కు, గ్రీన్‌ఫీల్డ్ హైవే తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుతో పరకాల నియోజకవర్గం అభివృద్ధి రూపురేఖలు మారనున్నట్లు తెలిపారు. ఇటీవల కొరియా పర్యటనకు వెళ్లి సీఎం.. టెక్స్‌టైల్ పార్కుకు సంబంధించి పెద్ద కంపెనీలతో చర్చించారని, ఆయా సంస్థల ప్రతినిధులు కొద్ది రోజుల్లో ఇక్కడ పర్యటించి పార్కులో పరిశ్రమలు పెట్టడానికి సముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. అలాగే వరంగల్, హనుమకొండ మీదుగా వెళుతున్న జాతీయ రహదారికి భూసేకరణ జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం భూములు కోల్పోతున్న రైతులకు సరైన పరిహారం అందిస్తామన్నారు. భూములు ఇస్తున్న రైతులకు 40 శాతం వరకు ఇప్పటికి పరిహారం అందించినట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వం పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆర్భాటంగా మొదలు పెట్టిందని, ప్రస్తుతం భవనం పెచ్చులూడిపోతూ ప్రమాదకరంగా మారిందని అన్నారు. రాబోయే నెల రోజుల్లోనే ఆస్పత్రి గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేయాలని ఆదేశించారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లను కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారన్నారు. వెంటనే వారి పేర్ల జాబితాలో అధికారులు రూపొందించాలన్నారు. టెక్స్‌టైల్ పార్కులో సెప్టెంబరు మూడోవారంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాతో ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ కడియం కావ్య, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్య శారద, పి.ప్రావీణ్య, పరకాల మునిసిపల్ చైర్‌పర్సన్ అనిత, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, మునిసిపల్ కమిషనర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

- అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం


6




సమావేశంలో మాట్లాడుతున్న ఈగ మల్లేశం











చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి


వేలేరు మండలం శాలపల్లి యువకుడి ఆత్మహత్య

వేలేరు, ఆగస్టు 18: వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని పంటలను సాగు చేయగా ఆశించిన మేరకు దిగుబడి రాకపోవడంతో పాటు పంట సాగుకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలనే మనోవేదనకు గురైన యువ రైతు పురుగుల మందుల తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా ఆదివారం తెల్లవారు జామున ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఏ సురేష్ తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా వేలేరు మండలం శాలపల్లి గ్రామానికి చెందిన దామెర సమ్మయ్య- కోమల దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. తండ్రి దామెర సమ్మయ్య పది సంవత్సరాల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబ భారం పెద్ద కుమారుడైన దామెర అనిల్ కుమార్ (31) పై పడింది. తమ్ముడు బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అలాగే చెల్లెలు వివాహాన్ని ఇటీవలచేశాడు. ఎలాంటి జీవనోపాధి లేకపోవడం, ఎలాంటి ఆస్తులు సైతం లేవు. కేవలం ఇళ్లు మాత్రమే ఉంది. ఆదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వ్యవసాయ భూమి 5 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. గత మూడు సంవత్సరాలుగా అందులో పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఇందులో ఆశించిన మేరకు పంట రాకపోవడంతో సుమారుగా రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. దీనికి తోడు కుటుంబ భారంతో మరో రూ.3.50 లక్షలు, మొత్తం రూ. 6.50 లక్షల వరకు అప్పులైయ్యాయి. దీంతో చేసిన అప్పుల ఎలా తీర్చాలని మరోవేదనకు గురైయ్యాడు. ఈక్రమంలో శనివారం అర్ధరాత్రి ఇంటి వద్ద పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పరిస్థితిని గమనించిన బంధువులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు, మృతునికి వివాహం కాలేదు. దీంతో మృతుడి తల్లి దామెర కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దామెర అనిల్‌కుమార్ (ఫైల్)



టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా రంజిత్



వరంగల్ లీగల్, ఆగస్టు 18: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా హనుమకొండ పట్టణానికి చెందిన న్యాయవాది కూనూరు రంజిత్ నియమితులయ్యారు. టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ ఈ మేరకు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కేఆర్. నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మానుకోట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సస్పెన్షన్

మహబూబాబాద్ జిల్లా ఇన్‌చార్జ్‌గా రవీంద్రశర్మకు బాధ్యతలు

మహబూబాబాద్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ శనివారం సాయంత్రం హైకోర్టు ఉత్వర్వులు జారీ చేసింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూ రు కోర్టు జడ్జి మట్ట సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈనెల 16వ తేదీ నుంచి 21 వరకు సెలవులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం. ఆయన స్థానంలో జనగామ జిల్లా కోర్టు జడ్జి బి.రవీంద్రశర్మకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిసింది.


బల్దియాలో నేడు ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 18: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం నేడు జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. సంబంధిత అధికారులు ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ తెలిపారు.











హరికథా గాన సరస్వతి

- నాలుగు దశాబ్దాలుగా కళారంగంలో తనదైన ముద్ర
- ఒడిదొడుకులను ఎదురైనా కళామతల్లి సేవలోనే..

లక్ష్మీనారాయణ భాగవతార్



మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య చేతుల మీదుగా సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ



జనగామ కల్చరల్, ఆగస్టు 18: హరికథ తెలుగువారి విశిష్ట ప్రక్రియ. రాగ - తాళ - హావ - భావ ప్రకటనలతో శ్రోతలను, ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో దానికదే సాటి. జానపదులకు, పండితులకు అందరికీ ఇష్టమైన కళాప్రక్రియ. వేదికపై ఓ వ్యక్తి నిలబడి తాను గానం చేస్తున్న హరికథలో వచ్చే పాత్రలన్నిటిని తానే ధరించి నటించి చూపాలి. అందుకే సర్వకళల సమాహారమే ఈ హరికథ గాన ప్రక్రియ. ఈ హరికథను తెలుగువారి సంస్కృతి చమత్కారంగా భావిస్తారు. కళలకు ఆదరణ తగ్గిపోతున్న సమయంలో భక్తి, జ్ఞాన, వైరాగ్యం కలిగి భగవన్నామస్మరణ చేస్తూ, పట్టు వస్త్రాలు ధరించి, కాళ్లకు గజ్జెలు కట్టి, నొదుట నామాన్ని దిద్దుకొని, చేతిలో చిరుతలు పట్టుకొని, హరినామ స్మరణ చేస్తూ, హరికథ ప్రదర్శనలు ఇస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు జనగామ జిల్లాకు చెందిన హరికథకుడు బొడిగె లక్ష్మీనారాయణ భాగవతార్. బొడిగె అంజమ్మ, శివయ్య దంపతులకు 1954 సెప్టెంబరు 25న జన్మించిన ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో బీటీఎల్ పట్టా పుచ్చుకొని హరికథా గానంతో జీవనాన్ని సాగిస్తున్నారు. ప్రముఖ తెలుగు పండితులు పండితారాధ్యుల రామగిరి నాగయ్య శాస్త్రి, ప్రముఖ సంస్కృత పండితులు, దేవీ ఉపాసకులు మాదవపెద్ది చిన వెంకన్న శాస్త్రి, ప్రముఖ రచయిత నెల్లుట్ల నర్సింహారావు లక్ష్మీనారాయణకు సాహిత్య గురువులు. 40ఏళ్లుగా రాజరాజేశ్వరీదేవి అమ్మవారినే ధ్యానిస్తూ హరికథ కళారంగంలో ఒడిదుడుకులు ఎదురైనా ఆ కళామతల్లికి సేవలోనే ఉన్నారు.

ప్రదర్శనలు.. సత్కారాలు.. అవార్డులు..

లక్ష్మీనారాయణ తన 14వ యేట 7వ తరగతి చదువుతున్న రోజుల్లో తల్లిదండ్రులతో కలిసి భద్రాచల దేవస్థానానికి వెళ్లి ఆ పవిత్రమైన గోదావరి నదీ తీరాన 'శ్రీ సీతారామ కళ్యాణం', 'భద్రాద్రి వైభవం' అనే సంగీత రూపకాన్ని రచించి స్థానిక చెన్న కేశవ స్వామి భజన మండలిలో చేరి అనేక వేదికల ద్వారా గానం చేశారు. 1972లో హైద్రాబాద్ ఆకాశవాణి, యువవాణిలో ఈ రూపకాన్ని గానం చేశారు. 1973లో స్థానిక నాటక కళాసంస్థ శ్రీ నటరాజ కళానికేతన్‌లో గాయకుడిగా చేరి తన గాన కళను అభివృద్ధి చేసుకున్నారు. 1975లో స్వతహాగా శ్రీ నటరాజ సంగీత విభావరి అనే పేరుతో ఒక సంస్థను స్థాపించి ప్రదర్శనలు ఇస్తూ ఔత్సాహిక గాయనీ గాయకులతో కలిసి భక్తి ప్రధానమైన సంకీర్తనలో కూడిన పాటక కచేరీలు చేశారు. ఆలిండియా రేడియో కేంద్రం ద్వారా అనేక ప్రత్యేక సంగీత రూపకాలైన నల్లనివాడు, దివ్య దీపావళి, హోలీ సంబరాలు, ఉగాది వేడుక, సంక్రాంతి సరదాలు, బతుకమ్మ సౌందర్యం మొదలగు రూపకాలు రచించి స్వయంగా సంగీతాన్ని సమకూర్చి ఆలిండియా రేడియో ద్వారా సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ ద్వారా మైసూరు, మద్రాసు, మహారాష్ట్ర, బీహార్, ఛత్తీస్‌గఢ్, రాయపూర్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా తదితర రాష్ట్రాల్లో హరికథా గానం చేసి అనేక సత్కారాలు, బిరుదులు అందుకున్నారు. ఓ వైపు ప్రదర్శనలిస్తూనే మరోవైపు హైద్రాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో హరికథ డిప్లొమా కోర్సు పూర్తి చేసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. 1995లో మద్రాసు భాగవతా సేవా మండలి వారితో సత్కారం అందుకున్న ఆయన.. ప్రముఖ సినీ నటుడు పొట్టి ప్రసాద్ చేతుల మీదుగా గానకోకిల బిరుదును అందుకున్నారు. కందుకూరి వీరేశలింగం జన్మదినం సందర్భంగా 2011లో నాటి ఏపీ ప్రభుత్వం తరపున కలెక్టర్ రాహుల్ బొజ్జా చేతుల మీదుగా రూ.10వేల నగదు, జ్ఞాపిక అందుకున్నారు. 2013లో నాటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని, 2015లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డితో సన్మానం అందుకున్నారు. 2024లో విజయనగరం ఆదిబట్ల నారాయణదాసు సంస్థ ఆధ్వర్యంలో హరికథా భాస్కర అనే బిరుదును, తాడేపల్లిగూడెంలో ప్రముఖ రంగస్థల నటుడు షణ్ముఖ ఆంజనేయ రాజు సంస్థ ఆధ్వర్యంలో 'హరికథా గాన సరస్వతి', సిద్దిపేటలోని ఎస్ఎస్‌సీ ఛానల్ ఆధ్వర్యంలో 'హరికథా కేసరి' బిరుదులను అందుకున్నారు. యువ సంగీత దర్శకులు, కవి చిలుమోజు సాయికిరణ్ రచించిన కవనతీగ కవితా సంపుటి పుస్తకావిష్కరణ సందర్భంగా 'జీవిత సాఫల్య పురస్కారం', 'హరికథా కళాబంధు' బిరుదును పొందారు. తెలంగాణ సమైక్యతా వజ్రోత్సవాలను పురస్కరించుకొని నాటి ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, కలెక్టర్ శివలింగయ్య, జడ్పీ ఛైర్మెన్ పాగాల సంపత్‌రెడ్డి చేతుల మీదుగా ఘన సన్మానం పొందారు.



సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వెంకటరాంరెడ్డి నుంచి సన్మానం అందుకుంటున్న లక్ష్మీనారాయణ

భరత నాట్యమయూరి..

అలకనంద



ప్రశంసా పత్రాలు, అవార్డులతో అలకనంద



మల్హర్, ఆగస్టు 18 : ఆ చిన్నారి వయసు 12యేళ్లు. ఆరో తరగతి చదువుతోంది. తనకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువతో ఓ గురువు వద్ద నాట్యం నేర్చుకుంటూనే.. సోషల్‌మీడియాలో అందుబాటులో ఉన్న నృత్య సాధన వీడియోలు చూసి మరింత సాధన చేసింది. చిన్నవయసులోనే పలు వేదికలపై ప్రదర్శనలిచ్చి ఔరా అనిపించుకుంటోంది భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని అన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన బానోత్ అలకనంద రాథోడ్. శాస్త్రీయ నృత్యంలో రాణిస్తూ అనేక ప్రశంస పత్రాలు, అవార్డులతో పాటు ప్రముఖులు, సాహితీ ప్రియుల ప్రశంసలు అందుకుంటోంది. అలకనంద తండ్రి బానోత్ రాజ్‌కుమార్ మాజీ సైనికుడు, తల్లి దివ్య గృహిణి. ప్రస్తుతం వారు భూపాలపల్లిలో నివాసం ఉంటుండగా.. అలకనంద పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. సాహిత్య రంగంలో పట్టున్న తండ్రి రాజ్‌కుమార్.. తన కూతురు అలకనందకు శాస్త్రీయ నృత్యంపై ఉన్న మక్కువను గుర్తించి.. రెండేళ్ల క్రితం పట్టణంలో నాని మాస్టర్ వద్ద చేర్పగా.. ఆయన శిక్షణ, సలహాలతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అలకనంద సోషల్ మీడియాలో వివిధ నాట్యాల వీడియోలు చూస్తూ సాధన ప్రారంభించి నాట్యంపై పట్టు పెంచుకుంటోంది. ఈ క్రమంలోనే పలు వేదికలపై నృత్య ప్రదర్శనలు ఇస్తూ సత్తా చాటుతోంది. భూపాలపల్లిలో సింగరేణి ఆవిర్భావ వేడుకల్లో, శ్రీరామ నవమి ఉత్సవాలు, గణపతి నవరాత్రి ఉత్సవాలు, హైదరాబాద్ రవీంద్రభారతి, త్యాగరాయ గానసభల్లో నిర్వహించిన పలు జాతీయ స్థాయి నృత్య పోటీలు, ప్రదర్శనలు, పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బడాఖానా వేడుకలు, తదితర వేదికలపై నృత్య ప్రదర్శనలు చేసింది. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ప్రశంసా ప్రతం, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ జన్మదిన వేడుకల్లో ప్రశంస పత్రం, ఉగాది పురస్కార వేడుకల్లో నాట్య కళ ప్రవీణ అవార్డు, విశ్వవిఖ్యాత ఆర్ట్స్ కల్చరల్ అకాడమీ, గౌతమేశ్వర గోసంరక్షణ సమితి ఆధ్వరంలో ఇటీవల గౌతమి నంది అవార్డు అందుకుంది. అలాగే జాతీయస్థాయి ఐకాన్ అవార్డు కూడా సొంతం చేసుకుంది. నాట్యంతో పాటు చదువులోనూ రాణిస్తున్న అలకనంద ఐఏఎస్ కావడమే లక్ష్యంగా తన భవిష్యత్‌కు బాటలు వేసుకుంటోంది.



జాతీయస్థాయి గౌతమి నంది అవార్డును అందుకుంటున్న అలకనంద

సౌకర్యాల లేమిలో గ్రంథాలయాలు

- నిధుల కొరతతో వసతులు కరువు
- తీవ్ర సిబ్బంది కొరత
- ఉన్నవారిపైనే పని భారం
- పదేళ్లుగా జరగని నియామకాలు
- పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నిర్వహణ

హనుమకొండ, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రంథాలయాలు నిధులలేమివల్ల అనేక సమస్యలతో కూనారిల్లుతున్నాయి. గ్రంథాలయాలకు వచ్చే పాఠకులకు కనీసం సౌకర్యాలు కల్పించలేకపోతున్నాయి. ఆరేళ్లుగా గ్రంథాలయాలకు బడ్జెట్ రావడం లేదు. దీంతో కరెంట్ బిల్లులు కట్టలేని దయనీయ స్థితి నెలకొన్నది. బిల్లులు చెల్లించకపోతే కరెంట్ సరఫరా నిలిపి వేస్తామని విద్యుత్ సంస్థ ఇప్పటికే వీటికి రెండు మూడు సార్లు నోటీసులు జారీ చేసింది. గ్రంథాలయాలకు పేపర్ బిల్లులు చెల్లించడానికి కూడా డబ్బులు లేవు. ఆరు నెలలుగా పేపర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పేపర్‌బాయ్‌లు బిల్లుల కోసం కాళ్లరిగేలా తిరుగు తున్నారు. బిల్లులు ఎంతకూ చెల్లించకపోవడంతో కొన్ని చోట్ల గ్రంథాలయాలకు పేపర్లు వేయడాన్ని మానుకున్నారు. కాలిపోయిన బల్బులను మార్చాలన్న, విరిగిపోయిన కుర్చీలకు మరమ్మతులు చేయించాలన్నా కూడా డబ్బులు లేక ఉద్యోగులు సతమతమవుతున్నారు.

వెల్లువలా ఉద్యోగార్థులు

ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టింది. ఈ మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ అవుతున్నాయి. దీంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు ఉద్యోగార్థులు పెద్ద సంఖ్యలో గ్రంథాలయాలకు వస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రంథాలయాలు అభ్యర్థులతో కిటకిటలాడు తున్నాయి. కూర్చోవడానికి కుర్చీలు కూడా సరిపోవడం లేదు. సరిపోయేన్ని కుర్చీలు సమకూర్చడానికి గ్రంథాలయాల వద్ద డబ్బుల్లేవు. దీనితో పాఠకులు ఏదోవిధంగా సర్దుకొని కూర్చొని చదువుకుంటున్నారు. పాఠకులకు కావలసిన స్టడీ మెటీరియల్ కోసం మార్కెట్‌లోకి వచ్చిన కొత్త పుస్తకాలను గ్రంథాలయాలు సమకూర్చలేకపోతున్నాయి. పాత పుస్తకాలతోనే పాఠకులు ఎలాగోలా సర్దుకుపోతున్నారు. కొత్త పుస్తకాల కోసం ఇండెంట్ పెడితే ఎప్పుడో గానీ రావడం లేదు. పాఠకులు డిమాండ్ బుక్‌లో రాసిన ఏ నెల రోజులకో గానీ అందడంలేదు. ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న పాఠకులు కరెంట్ అఫైర్స్ కోసం ఎక్కువగా వివిధ పత్రికలపై ఆధారపడుతుంటారు. ఎన్ని ఎక్కువ పత్రికలు చదివితే అంత తాజా మెటీరియల్ దొరుకుతుంది. కానీ డబ్బులు లేక ఏవో గ్రంథాలయాలు ఏవో కొన్ని పత్రికలను మాత్రమే పాఠకులకు సమకూర్చగలుగుతున్నాయి.



హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని జిల్లా క్రేంద గ్రంథాలయం

తీవ్ర సిబ్బంది కొరత

గ్రంథాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. రెగ్యులర్ ఉద్యోగులు వేళ్లమీద లెక్కపెట్టేంత మంది మాత్రమే ఉన్నారు. లైబ్రరీలన్నీ ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులతోనే నడుస్తున్నాయి. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతో సహా ఆరు జిల్లా గ్రంథాలయాలు, 50 మండల కేంద్రాల్లో 50 బ్రాంచ్ లైబ్రరీలు ఉన్నాయి. మండలాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన మండలాల్లో ఇప్పటి వరకు లైబ్రరీల ఏర్పాటు జరగలేదు. ఈ మండలాలకు చెందిన పాఠకులు పొరుగు మండలాలలోని లైబ్రరీలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉద్యోగ నోటిఫికేషన్ల వల్ల ఈ గ్రంథాలయాలు కూడా నిరుద్యోగ పాఠకులతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. ఈగ్రంథాలయాల్లో 150 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 21 మంది మాత్రమే ఉన్నారు. ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు మరో 50 మంది ఉన్నారు. రిటైర్ అయిన ఉద్యోగుల స్థానంలో కొత్తవారి నియామకాలు జరగటం లేదు. 1993 నుంచి కొత్త రిక్రూట్‌మెంటే లేదు. ప్రతీ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 25 నుంచి 30 మంది రెగ్యులర్ ఉద్యోగులు, 50మందికిపైగా ఔట్‌సోర్సింగ్, లేదా పార్ట్ టైమ్ ఉద్యోగులు ఉండాలి. అలాగే మండల కేంద్రంలోని బ్రాంచ్ లైబ్రరీలో 5గురు రెగ్యులర్ ఉద్యోగులు, 10 మంది ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా కేంద్ర గ్రంథాలయాల్లో 10 మందికన్నా తక్కువగా రెగ్యులర్ ఉద్యోగులు, 15 మంది వరకు ఔట్‌సోర్సింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు పని చేస్తున్నారు. పలు గ్రంథాలయాల్లో స్వీపర్లు లేరు. కొన్ని లైబ్రరీలను ఊడ్చేపనిని పార్ట్‌టైమ్ ఉద్యోగులే చేస్తున్నారు.

ఛైర్మన్లు లేరు..

జిల్లా కేంద్ర గ్రంథాలయాలకు ఛైర్మన్లు లేరు. గత బీఆర్ఎస్ హయాంలో నియమితులైన ఛైర్మన్లు రాజీనామా పెట్టడంతో ఆ పోస్టులు ఖాళీ అయ్యాయి. హనుమకొండలోని బీఆర్ఎస్ సర్కా రు హయాంలో నియమితులైన జిల్లా కేంద్ర గ్రంథాలయ ఛైర్మన్ అజీజ్‌ఖాన్ లోక్‌సభ ఎన్నికల ముందు తన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. అప్పటి నుంచి ఈ లైబ్రరీకి ఛైర్మన్ లేదు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన తర్వాత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఉద్యోగార్థులంతా లైబ్రరీలకు వెల్లువలా వస్తున్నారు. పెద్ద మొత్తంలో ఫీజు చెల్లించలేని గ్రామీణ నిరుపేద నిరుద్యోగులు స్టడీ మెటీరియల్ కోసం లైబ్రరీలనే ఆశ్రయిస్తున్నారు. ఈ దృష్ట్యా వాటిని పటిష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. క్రమం తప్పకుండా నెలనెలా వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నారు. సిబ్బంది కొరతను తీర్చాలని కోరుతున్నారు.

ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతి సంబురం

ఉమ్మడి జిల్లాలో 476 మంది జెఎల్ఎంలకు ఏఎల్ఎంలుగా పదోన్నతి



ఏడీఈ నుంచి ఏఎల్ఎంగా ఆర్డర్ కాపీని అందుకుంటున్న దృశ్యం

హనమకొండ టౌన్, ఆగస్టు 18: జేఎల్ఎంలకు ఏఎల్ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ ఎన్పీడీసీఎల్ పరిధిలోని డివిజనల్ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసి సిబ్బందికి ఆర్డర్ కాపీలను అందజేశారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌పై బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు చేపట్టాలని, మరోవైపు ఎస్సీ, ఎస్టీ అసోయేషన్లు మాత్రం రిజర్వేషన్ కమ్ సీనియారిటీ ప్రకారం పదోన్నతులు చేపట్టాలని కోర్టుకు వెళ్లాయి. కోర్టు తీర్పు పెండింగ్‌లో ఉండటంతో యాజమాన్యం బదిలీలు ముందుగా చేపట్టాలని ఆలోచనకు వచ్చింది. ఈక్రమంలోనే ఉద్యోగ సంఘాలన్నీ ఏకమై జాక్‌గా ఏర్పడి ముందుగా పదోన్నతులపై దృష్టి సారించాలని సీఎండీ వరుణ్‌రెడ్డికి మెమోరాండం అందజేశారు.

కాగా, పదోన్నతులపై కోర్టు వెలువరించే తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు తదుపరి చర్యలు తీసుకోబడుతాయని షరతులు విధిస్తూ అర్హత ఉన్న ప్రతీ జెఎల్ఎంకు ఏఎల్‌యంగా పదోన్నతి కల్పిస్తూ ప్రస్తుతం ఉన్న దగ్గరే విధులను కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, ఉద్యోగ సంఘాల చొరవ, కంపెనీ నిర్ణయంతో ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి 5 జిల్లాల్లో 2,361 మంది జెఎల్ఎంలు ఏఎల్‌యంలుగా పదోన్నతి పొందగా, ఉమ్మడి వరంగల్‌లో 476 మంది ఏఎల్ఎంలుగా పదోన్నతి పొందారు. వారిలో హనుమకొండ-119, వరంగల్ -101, జయశంకర్ భూపాలపల్లి, ములుగు- 98, జనగామ- 73, మహబూబాబాద్- 85మంది పదోన్నతి పొందారు.

మల్లన్నకు రూ.10 లక్షల రథం బహుకరణ

ఐనవోలు, ఆగస్టు 18 : ఐనవోలు మల్లికార్జునస్వామికి భక్తుడు రథం బహూకరించాడు. సుమారు రూ.10 లక్షల విలువచేసే రథాన్ని టేకు కర్రతో కళాకృతి ఉట్టిపడే విధంగా తయారు చేయించారు. హనుమకొండ రెడ్డి కాలనీకి చెందిన మల్లన్న భక్తులైన తాటికొండ రమాదేవిమల్లేశం దంపతులు తమ కుమారులైన కే.శే. రాజు, రంజిత్‌ల జ్ఞాపకార్థం రథాన్ని ఆలయానికి తయారు చేయించి ఇచ్చారు. అందులో భాగంగా ఆదివారం రథంను ఆలయానికి అందజేయగా ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు రథంను శుద్ధిచేసి గణపతిపూజ, పుణ్యాహ వచనం పూజలు చేసి స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంలో పెట్టి మాడ వీధులగుండా ప్రదక్షిణలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలైన మల్లేశం దంపతులకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



దాత బహుకరించిన రథంను ప్రారంభిస్తున్న ఈవో, అర్చకులు

ఆరోగ్యశ్రీ సిబ్బందికి వేతనాలు పెంచాలి

లేకుంటే ఈ నెల 20 తర్వాత సమ్మె

వరంగల్ మెడికల్, ఆగస్టు 18: రాష్ట్రంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది వేతనాలు పెంచాలని, ఆరోగ్య మిత్రలకు కూడా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షురాలు శిరీష డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 20 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాలకు ఇప్పటికే పలుమార్లు కలిశామని, అయినప్పటికీ తమ జీతాల పెంపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత తక్కువ జీతంతో కుటుంబాల పోషణ భారంగా మారిందని వాపోయారు. 17 ఏళ్ల నుంచి అరకొరలితో అలమటిస్తున్న తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీవో 60 ప్రకారం రూ.22,750 వేతనం తక్షణమే చెల్లించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కనీస వేతనాన్ని రూ.35వేలతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ప్రభుత్వం నష్టపరిహారం ప్రకటించాలని, హెల్త్‌కార్డు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

కవులు కలాలను ఎత్తాలి..

అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 18: పాలకుల నియంతృత్వ పోకడలను నిరసిస్తూ కవులు తమ కలాలను ఎత్తాలని అరసం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం హనుమకొండ బీఎడ్ కళాశాలలో అభ్యుదయ రచయితల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం నిధి బ్రహ్మచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పల్లేరు వీరస్వామి మాట్లాడుతూ.. బ్రిటీష్ వలసవాద దోపిడీని, దౌర్జన్యాల అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతో ప్రభావితమై జాతీయ వాద భావజాల స్ఫూర్తితో కాలాన్ని, గళాన్ని ఎత్తడం కోసం 1936లో ఆవిర్భవించిన సంఘం అభ్యుదయ రచయితల సంఘం అని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వెంకటి, మహ్మద్ సిరాజొద్దీన్‌లు పాల్గొన్నారు. అనంతరం వరంగల్ ఉమ్మడి జిల్లా అరసం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బూర భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మార్క శంకర్‌నారాయణ, సహ అధ్యక్షులుగా చందనాల సుమిత్ర, ఉపాధ్యక్షులుగా ఆనందాచారి, కాసుల రవికుమార్, సోమ నర్సింహచారి, చాగంటి కిషన్, రసూద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా గజ్జెల స్వరూపరాణి, సహాయ కార్యదర్శులుగా నరేందర్‌రెడ్డి, రాజు, సోమేశ్వరాచారి, రంగాచారి, లెనిన్, క్రాంతి కుమార్, కోశాధికారిగా రమేష్‌లను ఎన్నుకున్నారు.

డ్రగ్స్ ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యం

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ● పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా 4కే రన్



4కే రన్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌లు, సీపీ

బాలసముద్రం, ఆగస్టు 18: వరంగల్ నగరాన్ని డ్రగ్స్‌ఫ్రీ సిటీగా చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా వెల్లడించారు. ఆదివారం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 4కే రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ కలెక్టర్‌లు పి.ప్రావీణ్య, డాక్టర్ శారద, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో పాటు జబర్దస్త్‌ఫేం అదిరే అభి ముఖ్య అతిథులుగా పాల్గొని 4కే రన్‌ను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. 4కే రన్‌లో పోలీసులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌నుంచి అదాలత్ సెంటర్ వరకు, తిరిగి అక్కడి నుంచి పోలీస్ పరేడ్‌గ్రౌండ్ వరకు 4కే రన్ నిర్వహించారు. గెలుపొందిన వారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా నగదు పురస్కారాలను అందించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు డ్రగ్స్‌ను వ్యతిరేకించాలని, డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్‌ను నియంత్రించేందుకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను సేవించేవారిని వాటినుంచి దూరం చేసేందుకు అందరు ప్రయత్నించాలని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు అవాటుపడి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవీందర్, రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తోపాటు ఏసీపీలు దేవేందర్‌రెడ్డి, సీఐలు సత్యానారాయణరెడ్డి, పి.కిషన్, సతీష్‌కుమార్, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, వివిధ కళాశాల, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఏడీలు

ఆర్జేడీ కార్యాలయంలో పర్యవేక్షణ కరువు



ఏడీ లేక ఖాళీగా ఉన్న కుర్చీ

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 18 : పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఇద్దరు అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీలు) కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 19 జిల్లాలకు పర్యవేక్షక కార్యాలయంగా ఉంటున్న ఆర్జేడీ కార్యాలయంలో నిత్యం అందుబాటులో ఉండాల్సిన ఏడీలు.. ఎవరి దారి వారిదే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయంలో సిబ్బంది జీతభత్యాలకు సంబంధించిన బిల్లులను చేయాల్సిన డీడీవోగా బాధ్యతలు ఉన్న ఏడీ కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక స్థానికంగా ఉండే మరో ఏడీ ఆయన ఎప్పుడు వస్తారో తెలియదని వివిధ ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో ఉండే సదరు అధికారి అక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారు. ఇక మరో ఏడీ స్థానికంగానే ఉంటూ కార్యాలయానికి రావడం లేదనే విమర్శలున్నాయి. ఇదిలా ఉండగా ఈ మధ్యనే కార్యాలయానికి బదిలీపై వచ్చిన సూపరింటెండెంట్ అదే దారిలో వెళుతున్నట్లు తెలుస్తోంది.

పర్యవేక్షణ కరువు

ఏడీల విషయం తెలిసినా ఆర్జేడీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆర్జేడీ వివిధ జిల్లాల్లో పర్యటించిన సందర్భంలోనూ ఏడీల గైర్హాజరుపై దృష్టి సారించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా విధులకు రాకుండానే వేతనాలు అందుకుంటున్న ఏడీలపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరుతున్నారు.



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

శంభునిపేట, ఆగస్టు 18 : భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రంగశాయి పేటకు చెందిన అభ్యుదయా సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షులు మండల పరుశరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశానికి ప్రధాని రాజీవ్ గాంధీ సేవలు అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులంతా ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు అన్నారు. సమగ్రమైన వ్యాసాలను రాసి రంగశాయిపేట లోని ఉర్సు రోడ్‌లో గల అభ్యుదయా సేవాసమితి కార్యాలయానికి పోస్ట్ ద్వారా పంపించాలన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులతో పాటు నగదు పారితోషకం ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9849208279 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అమ్మవారి సన్నిధిలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎన్పీడీసీఎల్ సీఎండీ

వరంగల్ కల్చరల్, ఆగ స్టు 18: చారిత్రక భద్రకాళి అమ్మవారిని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు ఈవో శేష భారతి, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వల్లభ గణపతిని దర్శించుకొని భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ రమేష్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో పెద్దఎత్తున భక్తులు అమ్మవారి ఆలయానికి తరలివచ్చా రు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శించుకున్న భక్తులతో ఆలయం కిటకిటలాడింది. సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డిలకు ఆలయ ఈవో శేష భారతి, అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు ఆశీర్వచనం అందజేశారు.

రంగశాయిపేటలో ఘనంగా బోనాల పండుగ

శంభునిపేట, ఆగస్టు 18: నగరంలోని రంగశాయిపేటలో శ్రావణ మాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పోచమ్మతల్లికి పెద్ద ఎత్తున భక్తులు బోనాలు సమర్పించారు. అంతకు ముందు గ్రామదేవత (బొడ్రాయి)కు ప్రత్యేక పూజలు చేశారు. రంగశాయిపేటలోని గుంటి మైసమ్మకు భక్తులు బోనాలు సమర్పించారు. ఆనవాయితీ ప్రకారం బక్కి వంశీయులు బక్కి వాడ నుంచి ఆలయానికి డప్పు చప్పుళ్లతో ఆడంబరంగా బోనాలను ఎత్తుకొని ఆలయనికి చేరుకున్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, దామెరకొండ కర్ణాకర్, బక్కి వంశీ, శాంభవీ మహిళా మండలి బాద్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కోట నుంచి హైదరాబాద్‌కు మంత్రి పొంగులేటి

ఖిలావరంగల్, ఆగస్టు 18: వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలు ముగించుకొని ఖిలావరంగల్‌కోట నుంచి హెలీక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆదివారం వరంగల్ జిల్లా పరకాలనియోజక వర్గంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖామంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తిరుగు ప్రయాణంలో ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్ హెలీప్యాడ్ నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ క్రమంలో ఖిలావరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో హెలీప్యాడ్ కొసం ఏర్పాట్లు చేశారు.

రాఖీలను పంపిణీ చేసిన కార్పొరేటర్

మట్టెవాడ, ఆగస్టు 18: రాఖీ పండగను పురస్కరించుకొని ఆదివారం 28వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ గందె కల్పన నవీన్ ఆదివారం రాఖీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గందె కల్పన మాట్లాడుతూ అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగని అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా డివిజన్‌లో ప్రజలు రాఖీ పండగ జరుపుకోవాలని ఇంటింటి రాఖీలను పంపిణీ చేసినట్లు తెలిపారు. రాఖీలతోపాటు స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో 28 డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రామని సుమన్, కొత్తపెల్లి రాజేష్, శంకర్ సింగ్, శిల్ప, కార్తీక్, సదాశివుడు, సిద్ది రాములు, బోయిని రవి, నరసింహారెడ్డి, మురళి, నేరెళ్ల లక్ష్మణ్, శ్రీకాంత్, లోకేష్, పిట్ట చందు, పిట్ట విక్కి, కిరణ్, దామోదర్, పవన్, రమేశ్ పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలి

జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 18: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఆయన జీవితం అందరికి ఆదర్శమని, పాపన్న ఆశయాలను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో కృష్ణవేణి, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఎ.పుష్పలత, గౌడ సంఘం నాయకులు బొనగాని యాదగిరిగౌడ్, చిర్ర రాజుగౌడ్, డాక్టర్ బైరి లక్ష్మీనారాయణగౌడ్, గట్టు రమేశ్‌గౌడ్, కోలా రాజేష్ కుమార్‌గౌడ్, అనంతుల రమేశ్‌గౌడ్, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● శంభునిపేట: కృషి, పట్టుదలకు మారుపేరైన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటంలోని వీరత్వాన్ని మరువలేమని తెలంగాణ గౌడ సంఘం ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతం గౌడ్ అన్నారు. రంగశాయిపేట గౌడ సంఘం, కల్లు గీత పారిశ్రామిక సంఘాల ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయం వద్ద సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుల పెద్దలు పాలకుర్తి శ్రీనివాస్‌గౌడ్, చిన్న శ్రీను, సుమన్, రమే ష్, సతీష్, రవి, విలాసాగరం చిన్న శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ సత్యశారద



కాంగ్రెస్ నేతలతో ఎర్రబెల్లి స్వర్ణ

పార్టీ నేతలను కలిసిన ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్ సిటీ, ఆగస్టు 18: వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదివారం హైదరాబాద్‌లో భారీ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని, టీపీసీసీ క్యాంపెన్ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు అభిషేక్ సింఘ్వి, పద్మావతిలను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

బీజేపీ జిల్లా నూతన కమిటీ ఎంపిక

మిల్స్‌కాలనీ, ఆగస్టు 18: భారతీయ జనతా పార్టీ జిల్లా నూతన కమిటీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆదివారం ప్రకటించారు. స్థానిక సంస్థలను దృష్టిలో ఉంచుకొని పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు జిల్లాకు నూతన కమిటీని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా మాచర్ల దీన్‌దయాల్, కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, పైర్ల ఆనంద్, తాబేటి వెంకట్‌గౌడ్, గడల కుమార్, కొండేటి సత్యం, పి.ఏకాంతంగౌడ్, రేసు శ్రీనివాస్, అజ్మీర శ్రీనివాస్, పగడాల రాజ్‌కుమార్‌ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రధానకార్యదర్శులుగా బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, గోగుల రాణాప్రతాప్‌తో పాటు 10 మంది కార్యదర్శులను, ఏడుగురు అధికార ప్రతినిధులను నియమించారు. జిల్లా మహాసంపర్క్ అభియాన్ ప్రముఖ్‌గా సిద్ధం నరేష్‌ను నియమించినట్లు తెలిపారు. మొత్తంగా వివిధ విభాగాలకు 76 మందిని నియమించినట్లు గంట రవికుమార్ తెలిపారు.

వృద్ధాశ్రమానికి రూ 6.50 లక్షల విరాళం

అదనపు గదిని ప్రారంభించిన మాజీ శాసన సభ్యుడు టి.రాజేశ్వర్‌రావు

కరీమాబాద్, ఆగస్టు 18: తిమ్మాపూర్ శివారు అమ్మవారిపేట ప్రాంతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భోగవెల్లి సీనియర్ సిటిజన్ సెంటర్ వృద్ధాశ్రమ భవనంలో రూ. 6.50లక్షల విరాళం అందజేసి అదనపు గది నిర్మాణానికి సహకరించిన ఓ కుటుంబం ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన పల్లెపాటి జ్యోతి బాలకిషన్‌రావు, వారి సోదరులు తమ తల్లిదండ్రులైన అంజనమ్మ, నారాయణ రావు జ్ఞాపకార్థం అమ్మవారిపేటలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమంలో ఒక అదనపు గది నిర్మాణానికి రూ.6.50లక్షలు విరాళం అందజేశారు. కాగా ఈ విరాళంతో నిర్మాణం పూర్తి చేసుకున్న ఆ గదిని ఆదివారం ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ శాసన సభ్యులు టి.రాజేశ్వర్‌రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పేరాల మధుసూధన్‌రావులతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో అదనపు గది నిర్మాణానికి విరాళం అందించడం చాలా అభినందించదగిన విషయమని అన్నారు. పల్లెపాటి జ్యోతి, బాలకిషన్‌రావు కుటుంబాన్ని ఇతరులు ఆదర్శంగా తీసుకొని ఆశ్రమాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



గదిని ప్రారంభిస్తున్న మాజీ శాసన సభ్యుడు రాజేశ్వర్‌రావు, తదితరులు

పోచమ్మ బోనాలను విజయవంతం చేయాలి

పోచమ్మమైదాన్, ఆగస్టు 18: గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్‌లోని పైడిపెల్లిలో ఈ నెల 21న (బుధవారం) పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించనున్నట్లు విశ్వబ్రహ్మణ సంఘం పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు కనిపోజ్జల పూర్ణచంద్రాచారి తెలిపారు. పైడిపెల్లిలోని పోచమ్మ ఆలయంలో ఆదివారం వేడుక పనులు ప్రారంభించి, ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ ఆధ్వర్యంలో పోచమ్మ ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. గ్రామ ప్రజలందరు పెద్ద ఎత్తున బోనాలతో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జన్ను రాజయ్య, లింగం సంపత్, జన్ను సుధాకర్, బోయిని రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్టోబరులో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కరీమాబాద్, ఆగస్టు 18: నగరంలోని అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని శాంతినగర్, సాకరాశికుంట, హనుమాన్‌నగర్, ఏకశిలానగర్, పోచమ్మగుడి కాలనీలను కలుపుకుంటూ ఏర్పాటు చేయబోయే కట్టమీద బొడ్రాయికి సంబంధించి ఈ నెల 23న శుక్రవారం ఉదయం 8.29 గంటలకు వేదపండితుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహిస్తున్నట్లు బొడ్రాయి కమిటీ అధ్యక్షుడు ముష్కమల్ల సుధాకర్ తెలిపారు. అదే విధంగా అక్టోబరు నెలలో 19, 20, 21, 22 తేదీల్లో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించబడునని ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం సాకరాశికుంటలో బొడ్రాయి కమిటీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి బొడ్రాయి ఉత్సవాల వివరాలను వెల్లడించారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన, కార్యక్రమాల నిర్వహణ తేదీలతో కూడిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ముష్కమల్ల సుధాకర్ మాట్లాడుతూ అక్టోబరు మాసంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించే తేదీల్లో అండర్ రైల్వేగేటు ప్రాంతంలోని సాకరాశికుంట, శాంతినగర్, హనుమాన్‌నగర్, ఏకశిలానగర్, రైల్వేగేటు ప్రాంత ప్రజలు ఎలాంటి శుభకార్యాలు, వ్యక్తిగత కార్యక్రమాలను నిర్వహించకుండా బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా అక్టోబరు నెల 19న అంకురార్పణ, దంపతులచే హోమాలు, జలాదివాసం, 20న గ్రామోత్సవం, (విగ్రహాల ఊరేగింపు), హోమాలు, ధాన్యాదివాసం, సామూహిక కుంకుమ పూజలు, 21న యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపనలు, పూర్ణాహుతి, అన్నదానం, రాత్రి సమయంలో బలచల్లుట, పొలిపోయుట తదితర కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. సమావేశంలో కమిటీ సభ్యులు పులిశేరి నరేందర్, మందా శ్రీనివాస్, కత్తెరశాల వేణుగోపాల్, గాదె మధుసూదన్, మందా సతీష్, ముష్కమల్ల దేవేందర్, పొడాల కృష్ణమూర్తి, ఎం.డి.మోయినోద్దిన్, తాడం కుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ముగ్గురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, ఆగస్టు 18: వరంగల్ పోలీస్ కమిష నరేట్ పరిధిలో ముగ్గురు ఎస్ఐలను ఆదివారం బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో కె.శ్రావ ణ్ కుమార్ హనుమకొండ నుంచి రాయపర్తి, వి.సందీప్ రాయపర్తి నుంచి వీఆర్‌కు, డి.సాంబయ్య సీసీఎస్ నుంచి మట్టెవాడకు బదిలీ అయ్యారు. రెండుమూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు.

పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం

వర్ధన్నపేట, ఆగస్టు 18: పద్మశాలీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్య యుతంగా వర్ధన్నపేటలోని శ్రీఅరబిందో పాఠశాలలో జరుగుతున్న పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో ఈగ మల్లేశం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ దేశ చరిత్రలో ఓ కుల సంఘానికి ప్రజాస్వామ్య బద్ధంగా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే తొలిసారి అని అన్నారు. పద్మశాలీ సంఘం ఎన్నికలు అన్ని కులాల వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సహకార సంఘాల చట్టాలకు లోబడి నిర్వహిస్తున్న రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల తర్వాత ఇదే పద్ధతిలో అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్నికలు నిర్వహించిన తర్వాత జాతీయ స్థాయిలో అధ్యక్ష ఎన్నిక నిర్వహించుకోవడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు మార్త సారంగపాణి, పెద్దూరి సంజీవరావు, పాశికంటి రామచంద్రం, పెద్దూరి రాజ్‌కుమార్, అమృ తం వెంకటాద్రి, పెద్దూరి ప్రభాకర్, ఆడెపు శ్రీనివాస్, వడిచర్ల సాంబశివుడు, ఆడెపు ప్రకాష్, పసునూరి సంజీవ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈగ మల్లేశం

నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి

పోచమ్మమైదాన్, ఆగస్టు 18: యువత 'నేతాజీ సుభాష్‌చంద్రబోస్'ను ఆదర్శంగా తీసుకొని ఆయన మార్గంలో పయనించాలని జ్వాల అవినీతి వ్యతిరేఖ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ అన్నారు. గ్రేటర్ వరంగల్ నగరంలోని మూడవ డివిజన్ ఆరెపల్లిలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. జ్వాల సంస్థ అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంసంస్థ సభ్యులు సుంకరి రవి, సిందె రాజేష్, అమ్మ సురేందర్, హల్ది రవి, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా 'మాచర్ల'

పోచమ్మమైదాన్, ఆగస్టు 18: భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కరీమాబాద్ ఉర్సు ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకుడు మాచర్ల దీన్‌దయాల్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మాచర్ల దీన్‌దయాల్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

'చెత్త'శుద్ధి ఏదీ?!

(5వ పేజీ తరువాయి)

వల్ల చుట్టుపక్కల ప్రజలు ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఈ డంప్ యార్డు ద్వారా మడికొండ, రాంపూర్, కడిపికొండ, ధర్మసాగర్, నర్సింగరావుపల్లె, ఎలుకుర్తి, టేకులగూడెం, పెద్దపెండ్యాల, డీజీల్‌కాలనీ, సోమిడి, కాజీపేట ప్రాంతాల్లో నివసించే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చెత్త డంప్‌కు నిప్పుపెట్టడంతో ఆ ప్రాంతం పొగతో కప్పుకుని ఉంటోంది. చుట్టుపక్క గ్రామాలు నిత్యం పొగతో నిడిపోయి ఉంటుందని అంటున్నారు. కాలుష్యంతో కూడిన పొగవల్ల టీబీ, ఊపిరితిత్తుల జబ్బులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి డంపింగ్ యార్డు తరలించాలని పలుమార్లు మడికొండ వాసులు జాతీయ రహదారిపై ఆందోళన చేసిన సంఘటనలున్నాయి. అంతేకాక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. అలాగే ఈ డంప్‌యార్డులోని బయోమైనింగ్‌లో కొంత శుద్ధి చేసిన చెత్తను మిషన్‌ల ద్వారా పిండగా వచ్చిన నీరు.. పిలివాగు, సోమిడి కాలువ గుండా వడ్డెపల్లి చెరువులో కలుస్తున్నాయి. ప్రస్తుతం వడ్డెపల్లి చెరువు నీరు నగర ప్రజలకు తాగునీరుగా ప్రజలకు అందిస్తున్నారు. ఈ డంప్ యార్డును నగరానికి ఇంకా దూరంగా తరలించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి పొంగులేని ఆదేశాలు బేఖాతరు

వరంగల్ చుట్టుపక్కల ప్రాంతంలో ఆధునిక హంగులతో మరో చెత్త డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. ఇటీవల హైదరాబాద్‌లో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, బల్దియా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, అధికారులు కొత్త డంపింగ్ యార్డ్‌కు స్థలసేకరణ చేయాలని ఆదేశించారు. కానీ ప్రజాప్రతినిధులు ఎవరి పనుల్లో వారు బిజీబిజీగా ఉండడంతో వరంగల్‌లో రెండో డంపింగ్ యార్డ్ అనేది కలగానే మిగిలింది.

ఏసీబీ వలలో 'శ్రీముసలమ్మ' ఈవో

(5వ పేజీ తరువాయి)

తీసుకువచ్చాడు. అయితే షాపు పునరుద్ధరణకు లంచం ఇవ్వాలని ఈవో భిక్షమాచారి నెల రోజులుగా డిమాండ్ చేస్తున్నాడు. లేకుంటే మళ్లీ షాపును సీజ్ చేయిస్తానని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఈ విషయంపై సాంబయ్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు. దీంతో ఆదివారం మధ్యాహ్నం గుంజేడుకు వచ్చిన అధికారులు.. సాంబయ్యకు రూ.20వేలు ఇచ్చి ఈవో భిక్షమాచారి ఇప్పించారు. ఈవో రూ.20వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని కెమికల్ పరీక్షలు నిర్వహించి నిర్ధారణ చేసుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం భిక్షమాచారిని కస్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్‌లు శ్యాంసుందర్, రాజు పాల్గొన్నారు.

మరిపెడోలోని ఈవో ఇంట్లో తనిఖీలు

మరిపెడ: మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో ఆదివారం రాత్రి వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవోగా పనిచేస్తున్న భిక్షమాచారి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఈవో ఇంట్లో సైతం తనిఖీలు చేశారు. ఏసీబీ ఇన్స్‌పెక్టర్ ఎస్.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడలోని ఈవో ఇంట్లో రూ.70వేలు నగదు, 270 గ్రాముల వెండి, 4 గ్రాముల బంగారు అభరణాలు లభించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఆయన వెంట ఏసీబీ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 10వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

ఖిలావరంగల్, ఆగస్టు 18: తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్మీడియట్లలో అడ్మిషన్లు పొందేందుకు సెప్టెంబరు 10వరకు చివరితేదీ ఉందని ఈ అవకాశాన్ని చదువు మానేసిన పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల కో-ఆర్డినేటర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల ప్రసాద్ తెలిపారు. ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహించబడునన్నారు. ఇంటర్మీడియట్ ఒకే సంవత్సరంలో పూర్తిచేయవచ్చునన్నారు. అధిక వివరాలకోసం ఓపె న్ స్కూల్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ శైలేంద్రకుమార్ సెల్‌నెంబర్ 9603686850ను సంప్రందిచాలన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి రవి

ఖిలావరంగల్, ఆగస్టు 18: తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి రవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. శివనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు జడల అంజయ్య, నరిశెట్టి నర్సయ్యల అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా కొత్తపల్లి రవి, వరంగల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బళ్ల కనకయ్యలను ఎన్నుకున్నారు. అలాగే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుంటపల్లి ఉమాశంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అచ్చ రవి, సంయుక్త కార్యదర్శిగా గుండు కల్యాణ్, ఆర్గనైజింగ్ సెక్రటరిగా నల్ల రవిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడప రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండెడ్డి లింగన్న, కల్యాణ్, కుమార్, కనకయ్య, నర్సయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

కరీమాబాద్, ఆగస్టు 18: కరీమాబాద్ దర్గా ప్రాంతానికి చెందిన రాగి సోమేశ్వర్ (50) శుక్రవారం రాత్రి 1.30 గంటలకు బాత్‌రూంకి వెళ్లోస్తా అని చెప్పి తిరిగి రాలేదు. దీంతో అతని కుమారుడు రాగి వంశీ పలు చోట్ల వేతికినా ప్రయోజనం కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించకపోవడంతో ఆదివారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో తన తండ్రి కనిపించడం లేదని ఫిర్యాదు ఇవ్వడంతో ఆదివారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యం

కరీమాబాద్, ఆగస్టు 18: పుప్పాలగుట్టకు చెందిన యువతి కన్నెబోయిన సౌమ్య (19) శనివారం మధ్యాహ్నం బయటికి వెళ్లి వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. రాత్రి వరకు ఎదురు చూసిన సౌమ్య తిరిగి రాకపోవడంతో పలు చోట్ల గాలించిన ఫలితం కనిపించలేదు. దీంతో యువతి తల్లి తన కూతురు కనిపించడం లేదని తల్లి కన్నెబోయిన సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు ఆదివారం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కరీమాబాద్, ఆగస్టు 18 : కరీమాబాద్ బొమ్మలగుడి ప్రాంతంలో ఆదివారం రాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మల గుడి ప్రాంతంలో ఓ వ్యక్తి స్పృహ తప్పి పోవడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న సిబ్బంది మద్యం తాగి ఉన్న వ్యక్తి గురించి ఫోన్ చేస్తారా అంటూ, మొహం మీద నీళ్ల చల్లితే లేస్తాడు అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతూ ఫోన్ చేసిన వ్యక్తి నుంచి సంతకాలు తీసుకుని అక్కడి నుంచి వెళ్లి పోయారు. ఇదే విషయమై పోలీసులకు కూడా సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసే సరికి ఆ వ్యక్తి మృతి చెందగా పోలీసులు మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మృతుడు నల్ల చొక్కా, బ్లూ కలర్ బనియన్, బ్లూ జీన్స్ పాయింట్ ధరించి ఉన్నాడు. కాగా మృతుడు ఎవరనేది వివరాలు తెలియకపోవడం తో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

బాధిత కుటుంబానికి రాజయ్య పరామర్శ

ఖిలావరంగల్, ఆగస్టు 18:ఇటీవల మృతి చెందిన పూస వీరస్వామి కుటుంబాన్ని ఆదివారం మాజీ ఉపముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పరామర్శించారు. ఖిలా-పెట్రోల్‌పంపు వద్ద ఆయన నివాసంలో మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజయ్య మాట్లాడుతూ ఉద్యోగ వీరమణ అనంతరం తెలంగాణ ఉద్యమంతో వీరస్వామి చురుగ్గా పాల్గొన్నారన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL సోమవారం 19 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

హిందూ సంఘాల నిరసన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

నర్సంపేట టౌన్, ఆగస్టు 18 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మారణకాండకు నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నర్సంపేట పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గెస్ట్‌హౌజ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు కొనసాగింది. ర్యాలీని ఉద్దేశించి వేదిక నాయకులు పంజాల వెంకట్‌గౌడ్, మోతె సమ్మిరెడ్డి మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను ప్రతీ ఒక్కరు ఖండించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తవుటు రమేష్, చిప్ప బీమ్‌రాజ్, రేణుక, మల్యాల రవి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



చిన్నారిని ఆశీర్వదిస్తున్న మంత్రి పొంగులేటి, ధర్మారంలో మంత్రికి రాఖీ కడుతున్న మహిళలు

నామకరణకు హాజరైన మంత్రి పొంగులేటి

గీసుగొండ, ఆగస్టు 18 : గీసుగొండ మాజీ ఎంపీపీ వీరగోని కవితరాజ్‌కుమార్ మనవరాలు నామకరణ వేడుకను ఆదివారం గీసుగొండలో నిర్వహించగా రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డిలు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. కాగా ధర్మారం వద్ద కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రికి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మహిళలు రాఖీలు కట్టారు. దీంతో సోదర భావంగా రాఖీ కట్టిన మహిళలకు డబ్బులు ఇచ్చి ఆత్మీయతను చాటారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ గాదె దయాకర్, నాయకులు దూపాకి సంతోష్, గోదాసి వీరేశం, వసంత, చిన్న, హేమలత తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయానికి రూ.1లక్ష విరాళం

గీసుగొండ, ఆగస్టు 18: మండలంలోని రాంపురంలో నిర్మిస్తున్న అభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన బొమ్మగాని రవికుమార్ రూ.1 లక్ష విరాళాన్ని ఆదివారం అందచేశారు. ఆలయ ప్రహరీగోడ గేటును కూడా చేయిస్తానని చెప్పారు. అదేవిధంగా కొండోజు సరిత(కానిస్టేబుల్) శంకర్ దంపతులు ఆలయ మండపానికి రూ.1లక్షతో గ్రిల్స్‌ను ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, నాయకులు రడం భరత్, మాజీ ఉపసర్పంచ్ దర్శనాల కుమారస్వామి, వరిగెల రాజు, శ్రీధర్, రవి, గోపి, వేణు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్

సంగెం, ఆగస్టు 18 : బీజేపీ జిల్లా కార్యదర్శిగా సంగెం మండలం నార్లవాయి గ్రామానికి చెందిన మొలుగూరి శ్రీనివాస్ మరో మారు నియమితులు అయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆదివారం నియమించారు. పార్టీ కోసం శ్రీనివాస్ మండల, జిల్లా స్థాయిలో విశేషంగా కృషి చేయడంతో పార్టీకి చెందిన నియోజకవర్గ సినియర్‌ల సూచనల మేరకు శ్రీనివాస్ నియామకం అయ్యారు. తన నియామకం చేసిన జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌తో పాటు నియోజకవర్గ, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వర్ధన్నపేట, ఆగస్టు 18 : అంబేడ్కర్ ఆలోచన విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతరాజు లాలయ్య పిలుపునిచ్చారు. ఆదివారం వర్ధన్నపేటలోని తక్షశిల జూనియర్ కళాశాలలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం జరిగింది. సమావేశంలో తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మేకల చేరాలు, రాష్ట్ర, జిల్లా నాయకులు ఎల్లయ్య, తుమ్మల సదానందం, నమిండ్ల రవీందర్, కంచర్ల మహేష్, వల్లందాస్ కుమార్, చెన్నయ్య, వివేక్, మురళి, సుధాకర్, యాలాద్రి, మంద అమరేందర్, అనిల్ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే దొంతి జన్మదిన వేడుకలు

నెక్కొండ, ఆగస్టు 18: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదిన వేడుకలను నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఎంతో ఘనంగా జరిపారు. ప్రధాన కూడలిలో టపాసులను పేల్చి మిఠాయిలను పంచారు. నర్సంపేట టీపీసీసీ మెంబర్ సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ నర్సం పేట నియోజకవర్గం అభివృద్ధికి, పేదలకు సంక్షేమ పథకాలను అందించుటకు మాధవ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో నెక్కొండ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ రావుల హరిష్‌రెడ్డి, నెక్కొండ మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, హరిప్రసాద్, రామాలయ కమిటీ ఛైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండి శివకుమార్, చల్లా శ్రీపాల్‌రెడ్డి, రాచకొండ రఘు, గై లక్ష్మన్, కొల్లి సుబ్బారెడ్డి, రావుల షైపాల్‌రెడ్డి, నాగేంద్రమ్మ, శిరిష, మమ్మద్ షబ్బీర్, శ్రీకాంత్, ప్రవీణ్, వెంకన్న, కక్కెర్ల నాగయ్య, చెన్నకేశవులు, ఆనంద్ పాల్గొన్నారు.

● ఖానాపురం: ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ మండల అధ్యక్షుడు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ శాఖమూరి హరిబాబు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ తనను నమ్ముకున్న కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకునే నేత మాధవరెడ్డి అని అన్నారు. కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు ఎలగందుల రాజు, దేవినేని వేణుగోపాల్, వీరమనేని సాగర్‌రావు, పల్నాటి శ్రీను, పులి వెంకన్న, నవీన్ పాల్గొన్నారు.



నెక్కొండలో ఎమ్మెల్యే మాధవరెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

● చెన్నారావుపేట: మండలంలోని అమీనాబాద్, మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, అమీనాబాద్‌లో మాజీ సర్పంచ్ సిద్దెన రమేష్, కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు బండి హరీష్‌లు కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో మండల నాయకులు కుండె కుమారస్వామి, జోరు వీరయ్యగౌడ్, తూటీ పావని, మాజీ సర్పంచ్ బండి బాలరాజు, సంపత్‌రెడ్డి , వీరారెడ్డి, జాటోతు స్వామి, రాంచంద్రునాయక్, భద్రునాయక్ హన్మనాయక్, కిషన్, మాజీ ఎంపీటీసీ భద్రునాయక్, దేఎందర్, రవిందర్ , సతీష్, బాలు. తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి : అన్ని దానాలకంటే రక్తదానం గొప్పదని, రక్తాదానం చేసి ప్రాణాలను కాపాడే వ్యక్తులను అభినందించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని గిర్నిబావిలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి జన్మదినం సందర్భంగా యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మెగా రక్తాదానం శిబిరం నిర్వహించగా, శిబిరాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబులు ప్రారంభించారు. ఈ శిబిరంలో 35మంది రక్తాదానం చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. రక్తాదానం చేసిన వారికి ధృవీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, మార్కెట్ డైరెక్టర్లు రామారావు, దంజ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సాంబయ్య, డ్యాగం శివాజీ, బుచ్చిరెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న జయంతి

నర్సంపేటటౌన్, ఆగస్టు 18 : బహుజన ప్రజారాజ్య స్థాపకుడు, బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 374వ జయంతి వేడుకలను నర్సంపేట పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఖాల్‌రోడ్ సెంటర్‌లోని పాపన్నగౌడ్ విగ్రహానికి గౌడ సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్నగౌడ్ ఆశయాలనుకొనసాగించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ గౌడ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరగాని సాంబయ్యగౌడ్, తాళ్ల పెల్లి కుమారస్వామిగౌడ్, విగ్రహ కమిటీ అధ్యక్షుడు సొల్తి సారయ్యగౌడ్, మాజీ మునిసిపల్ ఛైర్మన్ నాగెల్లి వెంకట్‌నారాయణగౌడ్, తాళ్లపెల్లి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు శీలం రాంబాబు ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొంపెల్లి రాజేందర్, గూడూరు సందీప్, బానోతు వీరన్న పాల్గొన్నారు.

● నెక్కొండ : సర్దార్ సర్వాయి పాపన్న బహుజనులను ఏకం చేయడానికి చేసిన పోరాలను నేటి తరానికి తెలియ చేయాడానికి పాపన్న విగ్రహాలను విస్తృతంగా ఏర్పాటు చేయాలని మండల గౌడ సంఘం నాయకులు కోరారు. పాపన్న జయంతి వేడుకలను మండలంలోని నెక్కొండ, దీక్షకుంట, రెడ్లవాడ గ్రామాల్లో నిర్వహించారు.ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నెక్కొండ గౌడ సంఘం అధ్యక్షుడు కక్కెర్ల నాగయ్య, సర్వాయి పాపన్న విగ్రహ కమిటీ మెంబర్లు తాళ్లపల్లి చెన్నకేశవులు, అంబాల రాంగోపాల్, పలుసం పూర్ణచందర్, గడ్డం శ్రీనివాస్, గడ్డం ఆనంద్, పలుసం రాములు, కొంకాల ఐలయ్య దోనికన సారంగపాణి, మధు, సుధాకర్, భాస్కర్, కదురు జగన్, సాయిలు, కోయ్యడ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేటలో పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని కొత్తపెల్లి, ఇల్లంద గ్రామాల్లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక గౌడ కులస్థులు ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పీఏసీఎస్ ఛైర్మన్ రాజేష్ కన్నా మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికారం కోసం పాపన్న చేసిన పోరాటం కృషి మరువలేనివని తెలిపారు. కార్యక్రమాల్లో గౌడ కులస్థులు తాళ్లపెల్లి యాదగిరి, సమ్మెట లక్ష్మినారాయణ, సమ్మెట యాదగిరి, మోడెం కుమారస్వామి, పోశాల వెంకన్న, సట్ల భిక్షపతి, మడ్డి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● గీసుగొండ : మండలంలోని మచ్చాపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గౌడసంఘం నాయకులు పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సారంగపాణి, శ్రీనివాస్, రమేష్, రజనీకాంత్, యుగేందర్, ఆగయ్య, అనిల్, వీరభద్రయ్య, రాజలింగం, సూరయ్య నాగరాజు, ప్రవీణ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి: మండల కేంద్రంలో బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు, తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గౌడ కులస్థులు పెద్దగోని ఉప్పలయ్య, పులి శ్రీనివాస్, బొమ్మెర శ్రీను, కోతి కళ్యాణ్, చేగొండ సాయి, ప్రశాంత్, పవన్, సతీష్, అభిషేక్‌లు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● పర్వతగిరి : సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మండలంలోని అన్నారంషరీఫ్, వడ్లకొండ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పాపన్న విగ్రహం, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాపన్న స్ఫూర్తితో గౌడలు ఎదగాలని ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆకాంక్షించారు.

ఏసీబీ వలలో శ్రీముసలమ్మ ఈవో

(5వ పేజీ తరువాయి)

తీసుకువచ్చాడు. అయితే షాపు పునరుద్ధరణకు లంచం ఇవ్వాలని ఈవో భిక్షమాచారి నెల రోజులుగా డిమాండ్ చేస్తున్నాడు. లేకుంటే మళ్లీ షాపును సీజ్ చేయిస్తానని ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో ఈ విషయంపై సాంబయ్య ఏసీబీ అధికారులను సంప్రదించాడు.దీంతో ఆదివారం మధ్యాహ్నం గుంజేడుకు వచ్చిన అధికారులు.. సాంబయ్యకు రూ.20వేలు ఇచ్చి ఈవో భిక్షమాచారి ఇప్పించారు. ఈవో రూ.20వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకుని కెమికల్ పరీక్షలు నిర్వహించి నిర్ధారణచేసుకున్నారు. విచారణ చేపట్టిన అనంతరం భిక్షమాచారిని కస్టడీలోకి తీసుకున్నారు. ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్, రాజు పాల్గొన్నారు.

మరిపెడోలోని ఈవో ఇంట్లో తనిఖీలు

మరిపెడ: మరిపెడలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవో ఇంట్లో ఆదివారం రాత్రి వరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడ మండలంలోని గుంజేడు ముసలమ్మ ఆలయ ఈవోగా పనిచేస్తున్న భిక్షమాచారి ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో ఈవో ఇంట్లో సైతం తనిఖీలు చేశారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడలోని ఈవో ఇంట్లో రూ.70వేలు నగదు, 270 గ్రాముల వెండి, 4 గ్రాముల బంగారు అభరణాలు లభించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఆయన వెంట ఏసీబీ సిబ్బంది, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తిరుపతి



తిరుపతిరెడ్డి

సంగెం, ఆగస్టు 18: భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లాడి తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. ఖిలా వరంగల్ మండలం మామునూరుకు చెందిన సీనియర్ నాయకుడు తిరుపతి రెడ్డిని జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ ఆదివారం నియామకం చేశారు. తిరుపతిరెడ్డి గతంలో హనుమకొండ మండల యువమోర్చా మండల అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేయడంతో పాటు జిల్లా ప్రచార కార్యదర్శిగా రెండు పర్యాయాలు పార్టీ జిల్లా ప్రోటోకాల్ కన్వీనరుగా, వరంగల్ పార్లమెంటు కన్వీనర్‌గా, రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడిగా పనిచేసి పార్టీ కోసం నిరంతరం పనిచేశారు. తనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కలిపించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌తో పాటు జిల్లా, రాష్ట్ర నాయకులకు మల్లాడి తిరుపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



తిమ్మంపేటలో అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి దిష్టి బొమ్మ దహనం చేస్తున్న మహిళలు

నర్సంపేట, ఆగస్టు 18: కోల్‌కతాలో పీజీ రెండో సంవత్సరం విద్యనభ్యసిస్తున్న వైద్య విద్యార్థిని మోమితపై అత్యాచారం చేసి హత్యచేసిన దుండగులను ఉరితీయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ డిమాండ్ చేశారు. మోమిత హత్య సంఘటనకు నిరసనగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పాలక కవిత, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అక్కపెల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కోల్‌కతాలో వైద్య విద్యార్థిని మోమితపై అత్యాచారం చేసి, హత్యచేయడం అమానుషం, హేయమైన చర్యని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు, డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. దుండగులను కఠినంగా శిక్షంచాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో పిఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పూలక్క, రామ, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట స్వామి, రాజు, అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు భోగి సారంగపాణి, భద్రాద్రి, మల్లన్న, లక్ష్మయ్య, రవి పాల్గొన్నారు.

● దుగ్గొండి : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి, హత్యచేసిన వ్యక్తి దిష్టి బొమ్మను ఆదివారం మండలంలోని తిమ్మంపేటలో పీవోడబ్ల్యూ స్త్రీ సంఘటన ఆధ్వర్యంలో దహనం చేశారు. పీవోడబ్ల్యూ స్త్రీ సంఘటన రాష్ట్ర కార్యదర్శి మోడెం శ్రీలత మాట్లాడుతూ అత్యాచారం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. డాక్టర్లకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాషబోయిన అనిత, విజయ, శోభ, లక్ష్మీ, మమత, యాకలక్ష్మీ, స్వరూప, సమ్మక్క, శ్వేత, స్వప్న, భూమ అశోక్, సురేశ్, పిల్లల చిరంజీవి, నగేష్, మొగిలి, సురేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

చెత్తశుద్ధి ఏదీ?!

(5వ పేజీ తరువాయి)

వల్ల చుట్టుపక్కల ప్రజలు ప్రాణాంతకమైన వ్యాధుల బారిన పడుతున్నట్టు స్థానికులు వాపోతున్నారు. ఈ డంప్ యార్డు ద్వారా మడికొండ, రాంపూర్, కడిపికొండ, ధర్మసాగర్, నర్సింగరావు పల్లె, ఎలుకుర్తి, టేకులగూడెం, పెద్దపెండ్యాల, డీజీల్‌కాలనీ, సోమిడి, కాజీపేట ప్రాంతాల్లో నివసించే ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చెత్త డంప్‌కు నిప్పుపెట్టడంతో ఆ ప్రాంతం పొగతో కప్పుకుని ఉంటోంది. చుట్టుపక్క గ్రామాలు నిత్యం పొగతో నిడిపోయి ఉంటుందని అంటున్నారు. కాలుష్యంతో కూడిన పొగవల్ల టీబీ, ఊపిరితిత్తుల జబ్బులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడి డంపింగ్ యార్డు తరలించాలని పలుమార్లు మడికొండ వాసులు జాతీయ రహదారిపై ఆందోళన చేసిన సంఘటనలున్నాయి. అంతేకాక ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. అలాగే ఈ డంప్ యార్డులోని బయోమైనింగ్‌లో కొంత శుద్ధి చేసిన చెత్తను మిషన్‌ల ద్వారా పిండగా వచ్చిన నీరు.. పిలివాగు, సోమిడి కాలువ గుండా వడ్డేపల్లి చెరువులో కలుస్తున్నాయి. ప్రస్తుతం వడ్డేపల్లి చెరువు నీరు నగర ప్రజలకు తాగునీరుగా ప్రజలకు అందిస్తున్నారు. ఈ డంప్ యార్డును నగరానికి ఇంకా దూరంగా తరలించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి పొంగులేటి ఆదేశాలు బేఖాతరు

వరంగల్ చుట్టుపక్కల ప్రాంతంలో ఆధునిక హంగులతో మరో చెత్త డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇటీవల హైదరాబాద్‌లో జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, బల్దియా అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, అధికారులు కొత్త డంపింగ్ యార్డ్‌కు స్థలసేకరణ చేయాలని ఆదేశించారు. కానీ ప్రజాప్రతినిధులు ఎవరి పనుల్లో వారు బిజీబిజీగా ఉండడంతో వరంగల్‌లో రెండో డంపింగ్ యార్డ్ అనేది కలగానే మిగిలింది.

పద్మశాలీల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలి

అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం

వర్ధన్నపేట, ఆగస్టు 18 : పద్మశాలీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. నామినేటెడ్ పద్ధతిలో కాకుండా ప్రజాస్వామ్య యుతంగా వర్ధన్నపేటలోని శ్రీఅరబిందో పాఠశాలలో జరుగుతున్న పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో ఈగ మల్లేశం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ దేశ చరిత్రలో ఓ కుల సంఘానికి ప్రజాస్వామ్య బద్ధంగా ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే తొలిసారి అని అన్నారు. పద్మశాలీ సంఘం ఎన్నికలు అన్ని కులాల వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సహకార సంఘాల చట్టాలకు లోబడి నిర్వహిస్తున్న రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల తర్వాత ఇదే పద్ధతిలో అన్ని రాష్ట్రాల్లోనూ ఎన్నికలు నిర్వహించిన తర్వాత జాతీయ స్థాయిలో అధ్యక్ష ఎన్నిక నిర్వహించుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు మార్త సారంగపాణి, పెద్దూరి సంజీవరావు, పాశికంటి రామచంద్రం, పెద్దూరి రాజ్‌కుమార్, అమృతం వెంకటాద్రి, పెద్దూరి ప్రభాకర్, ఆడెపు శ్రీనివాస్, వడిచర్ల సాంబశివుడు, ఆడెపు ప్రకాష్, పసునూరి సంజీవ తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న ఈగ మల్లేశం

ప్రశాంతంగా పద్మశాలీ ఎన్నికలు

సంగెం : మండల కేంద్రంలో పద్మశాలీ సంఘానికి జరిగిన ఎన్నికలు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎన్నికల పోలింగ్‌లో కేంద్రంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 630 మంది ఓటర్లుండగా 571 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందకట్ల నరహరి చెప్పారు. రాష్ట్ర కమిటీ కోసం జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వం గుర్తించిన సంఘానికి అత్యధిక మెజార్టీ రానున్నదని చెప్పారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కందకట్ల కళావతి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

21న త్రిపుర గవర్నర్ రాక

పర్వతగిరి, ఆగస్టు 18: మండలంలోని కల్లెడ గ్రామానికి త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి ఈ నెల 21వ తేదీన రానున్నారు. గ్రామంలోని ఆర్డీఎఫ్ వనితా అచ్యుతాపాయ్ జూనియర్ కళాశాలలో సిబ్బంది కోసం నిర్మించిన వసతి గృహాలతో పాటు ఒకేషనల్ కోర్సులను ప్రారంభించడానికిగాను వస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆడెపు జనార్ధన్ తెలిపారు. ఆయనతోపాటు వర్ధన్నపేట, నర్సంపేట ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, దొంతి మాధవరెడ్డి, అనంతపాయి, ఆర్డీఎఫ్ సెక్రటరీ అడ్డాల వెంకట కిరణ్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని ఆయన కోరారు.

అభివృద్ధికి కాంగ్రెస్ అడ్డు

నిధుల రద్దు విషయంపై ప్రజల్లో చర్చపెట్టాలి

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, ఆగస్టు 18 : నర్సంపేట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మోకాలాడ్డుతుందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. నర్సంపేట అభివృద్ధికోసం మాజీ సీఎం కేసీఆర్ 2023-24కు సంబంధించి ఎస్‌డీఎఫ్ నిధులు మూడు జీవోల ద్వారా రూ.43.17కోట్లు మంజూరీచేశారని అన్నారు. జీవో 369ద్వారా 187పనుల కోసం రూ.7కోట్ల 22లక్షలు, జీవో452 ద్వారా 102 పనుల కోసం రూ.18.92 కోట్లు, ప్రొసిడింగ్ నంబర్ 384 ద్వారా 533 పనుల కోసం రూ.17కోట్లు నిధులను మంజూరీ చేయించుకొచ్చానని పేర్కొన్నారు. నియోజకవర్గం లోని నెక్కొండ, ఖానాపురం, చెన్నారావులో సెంటర్‌లైటింగ్ కోసం రూ.2కోట్ల 20లక్షలు, నియోజకవర్గంలో 102మహిళా సంఘాల భవనాల కోసం రూ.16.75కోట్లు, నియోజకవర్గంలోని 187మసీదులు, చర్చీలు, దేవాలయాల అభివృద్ధి కోసం రూ.7కోట్ల 22లక్షలు, 179 గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలోని 24 వార్డుల్లో సీసీ రోడ్లు అన్ని కుల సంఘాలకు కమ్యూనిటీ హాళ్లు, తాగునీటి వసతి, రైతు వేదిక పాఠశాలల అభివృద్ధి కోసం రూ.17కోట్ల నిధులు మంజూరీ చేయించుకు వచ్చా నన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో తాను తీసుకు వచ్చిన నిధులను వినియోగించుకోకుండా, ఆ నిధులను వెనక్కి పంపి నర్సంపేట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డు పడుతుందన్నారు. నిధుల రద్దు విషయంపై బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో చర్చపెట్టి కాంగ్రెస్ కుట్రను ఎండ గట్టాలని ఆయన పిలుపు నిచ్చారు.

నర్సంపేట మార్కెట్‌లో మొక్కజొన్నలకు అధిక ధర



రైతు దంపతులను సన్మానిస్తున్న ఛైర్మన్ శ్రీనివాస్

నర్సంపేట, ఆగస్టు 18 : నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధర కన్నా ఎక్కువ ధరతో మొక్కజొన్నలను విక్రయించి లాభం పొందిన రైతును ఆయన సతీమణిని వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ పాలాయి శ్రీనివాస్ సన్మానించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఆదివారం నల్లబెల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన చిన్నల సాంబయ్య అనే రైతు 40బస్తాల మొక్కజొన్నలను అమ్మకానికి తీసుకు వచ్చారు. పరమేశ్వర ట్రేడింగ్ కంపెనీ, శ్రీమణికంఠ ట్రేడర్ ఖరీదు దారులు క్వింటాల్ మొక్కజొన్నలను రూ.2,601 ధరతో కొనుగోలు చేశారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.2225 ఉండగా అధనంగా రూ.376 చెల్లించి మొక్కజొన్నలను కొనుగోలు చేయడంతో రైతు చిన్నల సాంబయ్య సంతోషం వ్యక్తం చేశారు. మద్దతు ధర కన్నా ఎక్కువ ధరతో రైతు మొక్కజొన్నలను మార్కెట్‌లో విక్రయించి లాభం పొందాడని తెలిసిన మార్కెట్ ఛైర్మన్ శ్రీనివాస్ రైతు సాంబయ్య ఆయన సతీమణికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివ సిబ్బంది. సతీష్, ప్రసాద్, అడ్తి,ఖరీదుదారులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు

రాయపర్తి, ఆగస్టు 18: పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భారీ కేకును కట్‌చేసి నాయకులకు, కార్యకర్తలకు తినిపించి, సంబరాలు నిర్వహించారు.

సమయం ప్రకారం టిఫిన్ అందించాలి

దుగ్గొండి, ఆగస్టు 18: గిర్నిబావిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర విద్యాలయంలో విద్యార్థులకు సమయం ప్రకారం టిఫిన్ అందించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. భోజన వడ్డనలో సమయ వేళలు పాటించాలని ఎంజేపీ గేట్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజేపీలో ఆదివారం ఉదయం 7-30 గంటలకు అందించాల్సిన టిఫిన్ ఉదయం 9-45 గంటలకు విద్యార్థులకు అందించారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరుస్తానన్నారు.

వర్షాలు కురవాలని పాటలు

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 18: మండలంలోని ఇల్లందలో వర్షాలుకురవాలని వరుణదేవుడిని వేడుకుంటూ స్థానిక మహిళలు ఆదివారం జలబిందెలతో ర్యాలీ నిర్వహించి, ఉయ్యాల పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.